10న టీజీఆర్జేసీ పరీక్ష

ఎర్రగడ్డ, మే 7: గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 10వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని బోర బండ గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమణమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఫస్టియర్ లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ (ఇంగ్లిష్ మీడియం) కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ప్రవేశ పరీక్షకు సంబంధించి హాల్ టికెట్‌ను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఉంటుందని.. గంట ముందుగా పరీక్ష హాల్ కు చేరుకోవాలని పేర్కొన్నారు.

సితార్ కచేరి టికెట్ల పేరుతో మోసం

బంజారా హిల్స్, మే 7: సితార్ సంగీత కచేరి టికెట్లు అంటూ ఆన్‌లైన్ లో నమ్మించి డబ్బులు వసూలు చేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లో నివాసం ఉంటున్న వ్యాపారి రన్బీర్ సింగ్ భగ్గా నాలుగు రోజుల క్రితం ఆన్‌లైన్‌లో రెడిట్ ఫోరం సైట్ చూస్తుండగా నోవాటెల్ హోటల్‌లో మే 4న భారీ సితార్ సంగీత కచేరి నిర్వహిస్తున్నట్లు ప్రకటన కనిపించింది. సితార్ ఫర్ మెంటల్ హెల్త్ బై రిషబ్ రికీ రామ్ శర్మ పేరుతో నిర్వహించే కచేరి టికెట్లు అందుబాటులో ఉన్నాయటూ గుర్తులేని వ్యక్తి వాట్సాప్ కాల్ చేశాడు. అతడి సూచన మేరకు టికెట్ల కోసం రూ 10,500 యూపీఐ ద్వారా చెల్లించారు. అయితే టికెట్స్ పంపకపోవడంతో అనుమానం వచ్చి కాల్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో తాను సైబర్ మోసానికి గురయ్యాయని గుర్తించిన బాధితుడు రణ్వీర్ సింగ్ బగ్గా బుధవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అపార్ట్‌మెంట్ సెక్రటరీ పై కేసు

వెంగళరావునగర్,మే 7: అపార్ట్ మెంట్ లో నివాసం ఉంటున్న వారిపై దురుసుగా ప్రవర్తించి, వాచ్ మెన్‌ను దుర్భాషలాడిన కేసులో జెక్ కాలనీ ఎస్వీహిల్స్ అపార్ట్‌మెంట్ అసోసియేషన్ సెక్రటరీ పై ఎస్ఆర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 5న సాయంత్రం అపార్ట్‌మెంట్‌లో గట్టిగా శబ్దం వినిపించింది. అనురాధ వెళ్లి చూడగా కరెంటు లేక పోవడంతో లిఫ్ట్ ఆగిపోయి కనిపించింది. లిఫ్ట్ లో ఉమాదేవి, వంశీకృష్ణ, సంగీత, రూప చిక్కుకుని కనిపించారు. వెంటనే విషయాన్ని లిఫ్ట్ లో ఉన్నరూప తన భర్త రాజశేఖర్ రెడ్డికి తెలిపింది. రాజశేఖర్ రెడ్డి సెక్రటరీ ఆదిత్య కు ఫోన్ చేసి చెప్పగా స్పందించలేదు. జనరేటర్ ఆన్ చేయాలని వాచ్‌మెన్‌కు చెప్పగా డీజిల్ లేదని చెప్పడంతో అనురాధ డబ్బులు ఇచ్చి డీజిల్ తెమ్మని చెప్పింది. వాచ్‌మెన్ డీజిల్ కోసం వెళ్తుండగా సెక్రటరీ ఆదిత్య అడ్డుకుని దర్భాలాడాడు. కోపోద్రిక్తుడైన ఆదిత్య డీజిల్ వద్దు.. ఏది వద్దు అంటూ వాచ్‌మెన్ పై కోపంతో ఊగిపోయాడు. అపార్ట్‌మెంట్ వాసుల ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సబితాఇంద్రారెడ్డి కడిగిన ముత్యంలాంటిది

మణికొండ, మే 7 : మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి కడిగిన ముత్యమని ఆమెపై మరోసారి ఎవరైనా కుట్రలు చేస్తే ఆ పాపం వారికే తగులుతుందని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు సీతారాం దూళిపాళ అన్నారు. పదమూడు సంవత్సరాలుగా ఓబులాపురం మైన్స్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటూ న్యాయస్థానంలో పోరాడి చివరకు క్లీన్‌చీట్‌తో బయటకు రావడంపై బీఆర్ఎస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె నివాసానికి మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. అనునిత్యం ప్రజా సంక్షేమం కోసం పాటుపడే సబితారెడ్డిపై కుట్రపూరితంగా పెట్టిన కేసుల్లో ఎలాంటి అవినీతికి పాల్పడలేదంటూ న్యాయస్థానమే తేల్చిచెప్పిందన్నారు. అంతకు ముందు మణికొండలో పెద్ద ఎత్తున పటాకులు కాల్చి బీఆర్ఎస్ నేతలు సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ధన్‌రాజ్,నరేందర్, రూపారెడ్డి, అందె లక్ష్మణ్‌రావు, ఉపేంద్రనాథ్‌రెడ్డి, విజయలక్ష్మి, రాజేంద్రప్రసాద్, జై రాం,భానుచందర్, సుమనళిని, రమణమూర్తి, ప్రవీణ్‌కుమార్, అశోక్, రేఖ, బిందు, మహేశ్ శేఖర్, గోపి తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నేతలు

ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశ్

మచ్చలేని నేత సబితాఇంద్రారెడ్డి..

మైలార్‌దేవ్‌పల్లి: ఓబులాపురం మైనింగ్ కేసులో సీబీఐ కోర్టు మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిని నిర్దోషిగా ప్రకటించడం ఆమె నిజాయితీకి నిదర్శనంగా నిలుస్తుందని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశ్ అన్నారు. బుధవారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం వెంకటేశ్ మాట్లాడుతూ సబితాఇంద్రారెడ్డి దశాబ్ద కాలంలో మచ్చలేని నాయకురాలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ప్రజల మన్ననలు పొందారన్నారు. ప్రజాక్షేత్రంలో ఆమె చేసిన సేవలు ఎంతో గొప్పవన్నారు. ప్రజలకు మంచి చేయడమే కానీ చెడు చేయాలనే ఆలోచన వారిలో ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో రాముయాదవ్, కొంపల్లి జగదీశ్, అశోక్‌కుమార్, కార్తీక్‌ముదిరాజ్, వేణు, అనిల్, రామకృష్ణ, ప్రవీణ్, సన్నీ, కార్తీక్, సుమన్, సాయి, సంతోష్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలందరూ ధైర్యంగా ఉండాలి

కిస్మత్‌పూర్ రహదారిలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అధికారులు

బండ్లగూడ, మే 7: ప్రజలందరూ ధైర్యంగా ఉండాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. భారత్, పాకిస్థాన్ యుద్ధభేరిలో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన ఆదేశాల మేరకు రాజేంద్రనగర్ పోలీసులతో కలిసి బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్ చంద్ర ఆధ్వర్యంలో బుధవారం కిస్మత్ పూర్ నుంచి బండ్లగూడ కూడలి వరకు మాక్ డ్రిల్‌ను నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. యుద్ధసమయంలో తీ సుకోవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. మాక్‌డ్రిల్‌లో మేనేజర్ మంజులత, డిప్యూటీ ఇంజినీర్ యాదయ్య మునిసిపల్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు, ఇతర శాఖల అధికారులు

శంషాబాద్ రూరల్, మే 7 : భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శంషాబాద్ జోన్ డీసీపీ రాజేశ్ తెలిపారు. బుధవారం సాయంత్రం శంషాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, రాళ్లగూడ, పాత శంషాబాద్ తదితర ప్రాంతాల్లో పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, ఫైర్, పంచాయతీరాజ్ శాఖల సమన్వయంతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీపీ రాజేశ్ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రోడ్లపై వాహనాలపై వెళ్లే ప్రజలు తప్పించుకోవడం కోసం సమీపంలో ఉన్న భవనాల్లో తలదాచుకోవాలని సూచించారు. ఒకవేళ ఇంట్లో ఉన్న సమయంలో గ్యాస్ సిలిండర్ బంద్‌చేసి పెట్టాలి. ఇలా పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శంషాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌రావు, సీఐ బాలరాజు, మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు, ఎంపీడీవో మున్నీ పాల్గొన్నారు.

ఊరెళ్తున్నారా.. సమాచారం ఇవ్వండి

హిమాయత్ నగర్ ,మే 7: వేసవి సెలవుల్లో విహార యాత్రలకు, ఊరికి వెళ్లేవారు పోలీస్ స్టేషన్ లో సమాచారం ఇచ్చి వెళ్లితే ఇంటి వద్ద ప్రత్యేక నిఘా పెట్టేందుకు నారా యణగూడ పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో పెట్రోలింగ్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తూ నిఘాను పటిష్టం చేస్తు న్నారు. దొంగలు తాళం వేసి ఉన్న ఇళ్లను మాత్రమే ఎంచుకుని దొంగతనాలకు పాల్పడే అవకాశముందని, వారిపై అప్రమత్తంగా ఉంటూ విధిగా జాగ్రత్తలు పాటించాలని పోలీసులు తెలుపుతున్నారు. విహార యాత్రలకు, ఊరికి వెళ్లేటప్పుడు పలు జాగ్రత్తలు పాటిస్తే దొంగల బారిన పడకుండా విలువైన వస్తువులు, నగలు, నగదును రక్షించు కోవచ్చని సూచిస్తు న్నారు. ఇంటికి తాళం వేసి యాత్రలు, ఊర్లే ముందు పక్కింటి వారితో పాటు స్థానిక పోలీసులకు సమాచారం ఇస్తే ఆయా ప్రాంతాల్లో రాత్రిపూట గస్తీ పెంచుతామని పోలీసులు ప్రజలకు తెలుపుతున్నారు. హాక్ఐ, ఫేస్ బుక్, వాట్సాప్‌ను ప్రజలు పూర్తిగా సద్వినియోగం చేసుకుని నేరాలను అదుపు చేయడానికి పోలీసులకు సహకరించాలని కోరుతున్నారు. అత్యవసర సమయంలో 100 లేదా 8712660120 నంబర్ల కు సమాచారం అందించాలని సూచిస్తున్నారు.

గస్తీ పెంచుతాం..

బస్తీలు, కాలనీలో అపార్ట్ మెంట్ లో నివాసం ఉండేవారు విహార యాత్రలకు, ఊరికి వెళ్లే సమయంలో సమాచారం ఇస్తే గస్తీ పెంచుతాం. అపార్ట్ మెంట్లకు సెక్యూరిటీగా ఉన్న వారు అప్రమత్తంగా ఉండాలి. రాత్రి సమయాల్లో అపార్టుమెంటులోకి వచ్చే అనుమానిత వ్యక్తులపై అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. ప్రతి ఇంటికి సీసీ కెమెరా ఉంటే ఈ సందర్భంలో ఎంతో ఉపయోగంగా ఉంటుంది. యాత్రలు, ఊర్లకు వెళ్లిన తరువాత ఇంటి పక్కవారికి ఫోన్ చేసి వివ రాలు తెలుసుకుంటూ ఉండాలి.

-చంద్రశేఖర్, నారాయణగూడ ఇన్‌స్పెక్టర్

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మైలార్‌దేవ్‌పల్లి, మే 7: గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటేదాన్ ఏరియాలోని టీఎస్ఐఐసీ ల్యాండ్ జీఎం ఫుడ్ కంపెనీ వెనుక మురికి గుంటలో వ్యక్తి పడి ఉన్నట్లు సమాచారం అందింది. సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా 35 సంవత్సరాల వ్యక్తి మృతి చెంఇది ఉన్నాడు. మురుగు నీటి గుంతలో రాయిపడి చనిపోయి ఉంటాడని మృతి చెంది రెండు రోజులు అయి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. వాకబు చేసిన ఎలాంటి సమాచారం అందలేదని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించామని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్‌లో కుమ్ములాట

ఖైరతాబాద్, మే 7: ఖైరతాబాద్ కాంగ్రెస్‌లో గ్రూపు తగాదాలు రొటీన్‌గా మారింది. నిన్నటి వరకు డీసీసీ పదవీ కోసం కుమ్ములాటలు కొనసాగగా, తాజాగా డివిజన్ అధ్యక్షుడి కోసం కొట్లాట మొదలైంది. ఖైరతాబాద్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ డివిజన్ అధ్యక్ష పదువులు తమ వారికేనంటే తమవారికంటూ ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ విజయా రెడ్డి అధిష్టానం ముందు ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలిసింది.ఇప్పటికే ఆ ఇద్దరు నేతల మధ్య వాగ్వాదం జరుగుతుండగా కాంగ్రెస్ పార్టీలో పదవుల కోసం తగాదాలు తారాస్థాయికి చేరుకున్నాయి.

గేటెడ్ కమ్యూనిటీస్ సమస్యలు పరిష్కరిస్తా

సమస్యలపై చర్చిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, అధికారులు, అసోసియేషన్ సభ్యులు

మణికొండ, మే 7 : పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు అన్నిశాఖల అధికారులు సమష్టిగా పనిచేయాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. గేటెడ్ కమ్యూనిటీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కోకాపేటలోని లెజెండ్ చైమ్స్ కమ్యూనిటీలో గేటెడ్ కమ్యూనిటీ నివాసితులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సురేశ్‌బాబు,నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డిలతో కలిసి హాజరైన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ కమ్యూనిటీల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా గేటెడ్ కమ్యూనిటీల్లో దోమల స్వైర విహారంతో అనారోగ్యాల బారిన పడుతున్నామని, కొన్నిరోజులుగా చికెన్‌గున్యా, డెంగ్యూ లాంటి విషజ్వరాలు ప్రబలి ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని ఎమ్మెల్యేకు వివరించారు. అదేవిధంగా గండిపేట ప్రధాన రహదారి మరింత విస్తరించి ట్రాఫిక్ రద్దీ లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. గేటెడ్ కమ్యూనిటీల సమీపంలో నుంచి వెళ్లే నాలాలల్లో ఎగువ ప్రాంతాల నుంచి మురుగునీరు వచ్చి నిల్వ ఉండటంతో అక్కడ దోమలు పెరిగి కమ్యూనిటీలకు వ్యాప్తి చెందుతున్నాయని దీంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి అధికారులకు తెలిపారు. సంవత్సర కాలం దోమలు విజృంభిస్తున్నాయని నాలాలపై రిటర్నింగ్ వాల్ నిర్మించి దిగువన నాలాను శుభ్రచేస్తే మురుగు కిందకు వెళ్లే అవకాశం ఉంటుందని సూచించారు. ప్రధాన రహదారిలో కూడా ట్రాఫిక్ రద్దీ తీవ్రంగా ఉంటుందన్నారు. గతంలో కోకాపేట నుంచి గండిపేట చౌరస్తా వరకు నిర్మించిన రహదారికి ఎలాంటి డీపీఆర్ లేకుండా నిర్మించడంతో భారీగా వర్షాలు కురిసినప్పుడు మగధ విలేజ్, లుంబినీ బ్రూక్, రాజపుష్ప ఆట్రీయా లాంటి గేటెడ్ కమ్యూనిటీల్లోకి నీరువచ్చి చేరుతుందని తెలిపారు. ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ నరేశ్‌కుమార్, ఏఈ శ్రీనివాస్, గేటెడ్ కమ్యూనిటీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నీలేశ్‌ప్రసాద్ దూబే, కార్యవర్గ సభ్యులు బందరు సురేశ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేశ్ ముదిరాజ్,నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, నాయకులు నర్సింహ, శ్రీకాంత్‌రెడ్డి, రామచంద్రారెడ్డి,కిరణ్, వసంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైనికులకు మద్దతుగా శాంతియుత సమావేశం

మైనార్టీల ఏకతా సమావేశంలో పాల్గొన్న సభ్యులు

మణికొండ, మే 7: భారత సాయుధ దళాలకు మద్దతును తెలుపుతూ మణికొండ మైనార్టీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో షేక్ ఆరిఫ్ మహ్మద్ నేతృత్వంలో మస్జిద్ ఈ హలీమా నెక్నాంపూర్ వద్ద శాంతియుత ఏకతా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రముఖులు తమ ప్రసంగాల్లో దేశ ఐక్యత, మత సామరస్యంపై దృష్టిసారించి, భారత సైనికులకు మద్దతుగా తమ సంఘీభావాన్ని ప్రకటించారు. ముస్లింలు దేశ అభివృద్ధికి చేసిన సేవలను గుర్తు చేస్తూ దేశభక్తి సందేశాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఫెడరేషన్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. మతాలు వేరైనా మనమందరం భారతీయులమే అనే సందేశంతో సమావేశాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో ఖుర్షీద్, అల్లాబ్, సలాం సాబ్, హమీద్, అదిల్, అజీముద్దీన్‌బైగ్, ఫర్హత్‌బైగ్, యూనుస్, షేక్ అల్లాబ్ , అజీజ్, జియా, ప్రసాద్, లక్ష్మీప్రసార్ పాల్గొన్నారు.

శంషాబాద్‌లో తాగునీటి తండ్లాట

- ట్యాంకర్లతో నీటిని తెచ్చుకుంటున్న వైనం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- చోద్యం చూస్తున్న మున్సిపల్, వాటర్‌బోర్డు అధికారులు

హైమద్‌నగర్ కాలనీలో ప్రైవేట్ ట్యాంకర్ ద్వారా తాగునీటిని తెచ్చుకుంటున్న కాలనీవాసులు

శంషాబాద్ రూరల్, మే 7 : వేసవిలో ప్రజలకు తాగునీటిని పంపిణీ చేయడంలో మున్సిపల్, వాటర్‌బోర్డు అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శంషాబాద్ పట్టణంలో హైమద్‌నగర్, వెల్లంకినగర్, మధురానగర్, ఆర్బీనగర్, ఆదర్శనగర్‌తో పాటు పలు కాలనీల్లో తాగునీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారు. తాగునీటిని సరఫరా చేయాలని శంషాబాద్ మున్సిపల్ అధికారులను కోరిన స్పందన లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. చివరికి తాగునీరు లేక ఇంట్లో నుంచి బయటికి వెళ్లలేని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు ట్యాంకర్లను ఆశ్రయించి తాగునీటిని తెచ్చుకొని కాలం వెల్లదీస్తున్నట్లు చెబుతున్నారు. శంషాబాద్ పట్టణానికి 4 మిలియన్ లీటర్ల తాగునీరు అవసరం కాగా అందులో అనుకున్నస్థాయిలో నీరురాకపోవడంతో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా రోజువారికి నీటి సరఫరా చేస్తున్నట్లు చెప్పుకుంటున్న అధికారులు ప్రజలకు మాత్రం తాగునీరు అందించడం లేదని ఆయా కాలనీల ప్రజలు ఆరోపిస్తున్నారు. రంజాన్ మాసంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చేయాలని కోరడంతో తాగునీటిని సరఫరా చేసిన వాటర్‌బోర్డు అధికారులు ఇటీవల కాలంలో అక్రమ నల్లా కనెక్షన్లు ఉన్నాయని నీటి సరఫరాను పూర్తిగా నిలిపివేశారు. అనుమతి ఉన్నవారికి సైతం ఇబ్బందులు తప్పడం లేదు. 15 రోజుల నుంచి హైమద్‌నగర్ కాలనీలో తాగునీటి సరఫరా కోసం ఉన్న బోరులో నీరు అడుగంటింది. మరమ్మతులు చేసి మరింతలోతుకు మోటర్ బిగిస్తే తాగునీరు వస్తుందని కాలనీవాసులు తెలిపారు. అధికారులు పట్టించుకోకపోవడంతో కాలనీ మొత్తానికి నీరులేక ఇబ్బందులు పడుతూ ట్యాంకర్ ద్వారా నీటిని తెచ్చుకొని కాలంగడుపుతున్నట్లు కాలనీ వాసులు తెలిపారు. వెల్లంకినగర్ కాలనీలో వారానికి ఒక్కరోజు మాత్రమే తాగునీటిని సరఫరా చేస్తున్నారని కాలనీ వాసులు తెలిపారు. బిల్లులు అధికంగా వస్తున్న వాటిని చెల్లిస్తున్న మా కాలనీ వాసులకు అనుకున్న స్థాయిలో తాగునీరు సరఫరా చేయడంలేదని వివరించారు. స్థానికంగా సరఫరా చేసే సిబ్బంది సైతం ప్రజలపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు తమ సమస్యను పరిష్కారం చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

సమస్యను పరిష్కరించాలని ఆందోళన చేస్తున్న వెల్లంకినగర్ కాలనీవాసులు

చర్యలు తీసుకుంటాం

వేసవిలో తాగునీటి డిమాండ్ బాగా పెరిగింది. శంషాబాద్ పట్టణ ప్రజలకు సరఫరా అవుతున్న నీరు చాలడం లేదు. ప్రజల అవసరాలను అనుకులంగా తాగునీటిని ఇవ్వడం కోసం కృషి చేస్తున్నాం. హైమద్‌నాగర్ కాలనీలో అక్రమ కనెక్షన్లు ఉండటంతోనే నీటి సరఫరా నిలిపివేశాం. వెల్లంకినగర్ కాలనీలో ఏర్పడిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటాం.

-హసీనా,వాటర్‌బోర్డు మేనేజర్

అస్తవ్యస్తంగా డ్రైనేజీ నిర్మాణ పనులు

డ్రైనేజీ పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ మహాలక్ష్మి

హిమాయత్ నగర్,మే7: ఇటీవల హైదర్‌గూడలో నారాయణగూడ జలమండలి అధికారులు చేపట్టిన నూతన డ్రైనేజీ నిర్మాణ పనులు సక్రమంగా చేయకపోవడంతో సమస్యలు తలెత్తాయి. డ్రైనేజీ, రెయిన్ వాటర్ సంబంధించిన పైప్ లైన్లు పురాతనవి కావడంతో నెల రోజుల క్రితం జలమండలికి సంబం ధించిన కాంట్రాక్టర్ రెయిన్ వాటర్ పైప్ లైన్ వ్యవస్థను ధ్వంసం చేసి నూతన డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టారు. రెయిన్ వాటర్ పైప్ లైన్ లోకి డ్రైనేజీ నీరు వెళ్లేలా పనులు చేసి వెళ్లారు. వర్షపు నీటి పైపులైన్ నిర్మాణ పనులు కొనసాగుతున్న తరుణంలో బుధవారం జీహెచ్ ఎంసీ ఇంజినీరింగ్ విభాగం డీఈ ప్రవీణ్, ఏఈ పవన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాము పర్యవేక్షించడంతో రెయిన్ వాటర్ పైప్ లోనుంచి మురుగునీరు రావడాన్ని గుర్తించి మ్యాన్ హోల్స్ తెరిచి చూడగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. కార్పొరేటర్ మహాలక్ష్మి ఘటన స్థలానికి చేరుకుని పర్యవేక్షించగా జలమండలి పనితీరు బయటపడింది. మేనేజర్ ఉమా మహేశ్వరరావుకు ఫోన్ చేసి విషయం ఆరా తీయగా ఆయన వచ్చి ఇలాంటి పునరావృతం కాకుండా చూస్తామని, అసంపూర్తిగా ఉన్న పనులు చేయిస్తామని చెప్పారు.

అగ్నిప్రమాదంలో కొరియోగ్రాఫర్ మృతి


వీరేందర్‌రెడ్డి

మణికొండ, మే 7: అర్ధరాత్రి సమయంలో అగ్నిప్రమాదం జరగడంతో ఓ సినీ కొరియోగ్రాఫర్ ఊపిరాడక మృతి చెందిన ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పుప్పాలగూడ శ్రీనగర్ కాలనీ కుతుబ్ ఆర్కేడ్ అపార్ట్‌మెంట్‌లో పోరేటి వీరేందర్‌రెడ్డి(38) ఉంటున్నారు. అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో వీరందర్‌రెడ్డి పడుకున్న గదిలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. మరో గదిలో నిద్రిస్తున్న కుటుంబ సభ్యులు గమనించి స్థానికులకు, పోలీసులకు సమాచారం అందించారు. వారు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించడంతో వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేసి గదిలో ఉన్న వీరేందర్‌రెడ్డిని బయటకు తీసి సీపీఆర్ ప్రయత్నం చేశారు. అప్పటికే మరణించారని వైద్య సిబ్బంది తెలిపారు. ఈ అగ్నిప్రమాదంలో ఫర్నిచర్, దుస్తులు, పత్రాలు తదితర గృహపకరణాలు కాలిపోయాయి. వీరందర్‌రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ వార్షికోత్సవం



బండ్లగూడ, మే 7: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గంధం గూడలో శ్రీశ్రీశ్రీ జ్ఞాన వేంకటేశ్వర స్వామి దేవాలయం వార్షికోత్సవాన్ని బుధవారం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయనను వేద పండితులు శాలువాతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

శంషాబాద్ రూరల్, మే 7 : అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి చెందిన ఘటన బుధవారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దషాపూర్ గ్రామానికి చెందిన హారిక (25) ఈ నెల 6 న నగరంలోని ఉస్మానియా దవాఖానలో మృతి చెందినట్లు తల్లి సత్తమ్మకు పెద్దషాపూర్ గ్రామానికి చెందిన ఆంజనేయులు ఫోన్ ద్వారా సమాచారం తెలుపగా వెంటనే అక్కడికి వెళ్లి చూడగా ఆమె అప్పటికే మృతి చెంది ఉంది. కూతురు మృతిపై అనుమానం వచ్చిన తల్లి బుధవారం శంషాబాద్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇండియన్ బ్యాంకులో అగ్నిప్రమాదం

హిమాయత్ నగర్,మే7: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఇండియన్ బ్యాం కులో అగ్ని ప్రమా దం సంభవించింది. ఈ ఘటన నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిదిలో చోటు చేసు కుంది. ఇన్ స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం నారాయ ణగూడలోని తాజ్ మహల్ హోటల్ సమీపంలో ఉన్న ఇండియన్ బ్యాంకులో బుధవారం ఉదయం విద్యుత్ వైర్ల నుంచి ఆకస్మాతుగా మం టలు వచ్చి దట్టంగా పొగలు కమ్ముకున్నాయి. దీంతో బ్యాంకు లోపల దట్టమైన పొగలు నిండి పోయి మంటలు వ్యాపించాయి. మంటలను గమనించిన స్థానికులు డయల్ 100 సమాచారం ఇవ్వ డంతో హుటా హుటిన నారా యణ గూడ పోలీసులు సంఘటన స్థలా నికి చేరుకుని అగ్నిమాపక సిబ్బంది ని పిలిపించారు . ఒక ఫైర్ ఇంజన్ తో సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు. ఈ ప్రమాదంలో విలువైన కంప్యూటర్లు, ఫైల్స్, ఏసీలు, ఫర్నిచర్ తదితర వస్తువులు కాలి బూడిదయ్యాయి. ఏలాంటి ప్రాణనష్టం జరుగక పోవడంతో అంతా ఊపిరి పీల్చు కున్నారు. మంటలు వ్యాపించకుండా సకాలంలో మంటలు ఆర్పి వేయడంతో పెను ప్రమాదం తప్పింది. షార్ట్ సర్క్యూట్ కారణం గా ఈ ప్రమాదం జరిగినట్లు అగ్ని మాపక శాఖ ప్రాథమికంగా నిర్ధా రించింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్ స్పెక్టర్ చంద్ర శేఖర్ తెలిపారు.